క్లుప్తంగా

సీసీరోడ్డు ప్రారంభించిన కేంద్ర మంత్రి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలో శనివారం అంతర్గత సీసీ రోడ్డును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం లంబాడిపల్లిలో బీజేపీ కార్యకర్త ఇంట్లో భోజనం చేశారు. మై విలేజ్ షో ఫేం గంగవ్వను కలిశారు. ముత్యంపేటలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే శోభక్క, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం, సంగని రవి, బొబ్బిలి వెంకటస్వామి, బొట్ల ప్రసాద్, కోను లస్మయ్య, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బండ తీయిస్తేనే ఇంటి పన్ను చెల్లిస్తాం



సమస్య వివరిస్తున్న యజమానురాలు

రాయికల్: పట్టణంలో ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని కోరుతూ అదనపు కలెక్టర్ లత శనివారం బల్దియాలోని పోచమ్మవాడలో ఉన్న బోడుగం మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి ఇంటికి స్వయంగా వెళ్లారు. ఇంటి పన్ను ఎందుకు చెల్లించడం లేదని అదనపు కలెక్టర్ ప్రశ్నించగా తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న మురికి కాలువ నుంచి బండరాయిని తొలగించాలని ఐదేళ్ల పాటు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, దీంతో ఐదేళ్లుగా ఇంటి పన్ను చెల్లించడం లేదని, ఇప్పుడు తీయిస్తే వెంటనే చెల్లిస్తామని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే బండరాయిని తొలగిస్తామని, పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను చెల్లించాలని సూచించారు.

నూతన అధ్యాపకుల రాకతో కళాశాలల బలోపేతం



స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

జగిత్యాల: నూతన అధ్యాపకుల రాకతో ప్రభుత్వ కళాశాలలు బలోపేతం అవుతాయని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం జూనియర్ లెక్చరర్లు కళాశాలలో చేరారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం వారిని స్వాగతించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సునీత, సుమేర, స్వరూప, జగన్, సాజీద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



కూలీల హాజరు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ

మల్యాల: మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులను శనివారం డీఆర్డీవో పీడీ రఘువరన్ ఎంపీడీవో స్వాతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. నిత్యం సగటు వేతనం రూ.300 వచ్చే విధంగా తగు కొలతలతో పనిచేయాలని సూచించారు. పని ప్రదేశంలో నీడ, తాగునీటి ప్రథమ చికిత్స మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రామన్నపేటలో అజోల్లా పెంపకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఏపీవో స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

వినియోగదారునికి ప్రశ్నించేతత్వం ఉండాలి

జగిత్యాల: వినియోగదారునికి ప్రశ్నించేతత్వం ఉండాలని, అప్పుడే నాణ్యమైన వస్తువులు వాస్తవ ధరకు అందుతాయని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గోవర్ధన్, రజిత, స్వప్న, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

జగిత్యాల: ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ట్రెజరీలో ఆమోదం పొంది ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, భూమేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సుశీల, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన ప్రారంభం

- విద్యార్థుల నైపుణ్యం, సామర్థ్యం పెంపే లక్ష్యం
- జిల్లాలో 21 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం



వెంకటాపూర్ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పాఠాలు ప్రారంభం

కోరుట్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే 3,4,5 వ తరగతి విద్యార్థుల్లో కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు విద్యార్థుల సంఖ్య పెరిగేలా చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని జిల్లాలోని 21 పాఠశాలల్లో శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైమరీ, హైస్కూల్ ఒకే కంపౌండ్‌లో ఉన్న చోట ఈ పథకాన్ని మొదట ప్రారంభించారు. ప్రస్తుతం హైస్కూల్ విద్యార్థులకు మాత్రమే కంప్యూటర్ శిక్షణను ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా అదే కంపౌండ్‌లో ఉన్న ప్రైమరీ స్కూల్ 3,4,5 వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం కల్పించే ఏర్పాటు చేశారు.

కంప్యూటర్‌లో తెలుగు, మాథ్స్ సబ్జెక్టులు..

ఈ శిక్షణలో ప్రస్తుతం విద్యార్థులు తెలుగు, మాథ్స్ సబ్జెక్టులను కంప్యూటర్‌లో పొందుపరిచారు. ముమ్మందు అన్ని సబ్జెక్టులు పొందు పరిచే అవకాశం ఉంది. కంప్యూటర్‌లో అడిగే ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. ఆ ప్రశ్నకు విద్యార్థి రైట్ ఆన్సర్ చేస్తే ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇలా విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ప్రశ్నలు ఎంచుకునే అవకాశం ఉంది.ప్రస్తుతం హైస్కూల్‌లో ఉన్న కంప్యూటర్లను ఉపయోగిస్తున్నప్పటికీ త్వరలో ప్రైమరీ స్కూళ్లలో కూడా కంప్యూటర్లు సమకూర్చనున్నారు.

అభ్యసన సామర్థ్యాల మెరుగు కోసమే ఏఐ బోధన



తిమ్మాపూర్‌లో పాఠాలు ప్రారంభిస్తున్న ఎంఈవో

మెట్‌పల్లిరూరల్/గొల్లపల్లి/ఇబ్రహీంపట్నం/మేడిపల్లి/మల్లాపూర్: ప్రాథమిక విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలను మెరుగు పర్చేందుకు జిల్లా లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) బోధన ప్రారంభించారు.గొల్లపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో డీఈవో రాము ఏఐ పాఠాలు ప్రారంభించారు. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఏఐ తరగతులను ప్రారంభించారు.ఇబ్రహీంపట్నం తిమ్మాపూర్,ఎర్దండి ప్రాథమిక పాఠశాలలు, మేడిపల్లి దమ్మన్నపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయా మండలాల ఎంఈవోలు ఏఐ బోధన ప్రారంభించారు. ఏఐ బోధనతో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటారని తెలిపారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఘనంగా రథోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఉంచిన రథాన్ని భక్తిశ్రద్ధలతో గ్రామవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో దశమ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారి చక్రస్నానం అనంతరం సుప్రభాతం, సేవాకాలం, పంచహారతి, అష్టోత్తర శత కలషాభిషేకం, మహా పూర్ణాహుతి, కుంబాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు శ్రీనంబి వేణుగోపాలచార్య, వంశీకృష్ణమాచార్య బృందం, ఆలయ అర్చకులు రమేశ్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ మల్లన్న స్వామి వారి జాతర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి.ఆ తర్వాత స్వామి వారి మూలవిరాట్‌ను ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గోదావరికి పుణ్యస్నానం కోసం తీసుకెళ్లి జలాభిషేకం చేశారు. అర్ధరాత్రి మల్లన్న స్వామి కల్యాణం నిర్వహించి, పట్నాలు వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల భిక్షాటన



రాయికల్‌లో భిక్షాటన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

రాయికల్: గ్రామీణ ఉపాధిహామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు మంజూరు కాకపోవడంతో శనివారం రాయికల్ పట్టణంలో ఫీల్డ్ అసిస్టెంట్లు భిక్షాటన చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వేతనాలు మంజూరు చేయడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల ఫోరం అధ్యక్షుడు భూక్య తిరుపతి, నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లు కనికరపు లక్ష్మణ్, మహ్మద్ నసీర్, మామిడిపల్లి మహేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్



స్తంభాలకు మ్యాపింగ్ నంబర్ వేస్తున్న సిబ్బంది

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా విద్యుత్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ వినియోగదారులకు సేవలు అందించేందుకు ప్రయత్నిస్తుంది. ఈ నేపథ్యంలో కరెంట్ స్తంభాలకు అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్ సిస్టం అమలు చేస్తున్నారు. దీని ప్రకారం జిల్లాలోని ప్రతీ స్తంభానికి నంబర్ వేస్తారు. ఆ ప్రాంతంలో ఏదైనా విద్యుత్ సమస్య ఉత్పన్నమైనప్పుడు స్థానికులు ఆ పోల్ నంబర్ చెబితే క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బంది లొకేషన్ మ్యాపింగ్ ద్వారా సమస్య ఉన్న స్తంభం వద్దకు చేరుకుని పరిష్కరిస్తారు. ఈ ప్రక్రియతో విద్యుత్ శాఖ నాణ్యమైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తుందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాలీయానాయక్ పేర్కొన్నారు.

తుషార్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

జగిత్యాలటౌన్: బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తుషార్‌గాంధీ క్షమాపణ చెప్పాలని భారత్ సురక్షాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో తుషార్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బాసుస నాయకులు పుప్పాల సత్యనారాయణ, వేముల పోచమల్లు, సింగం గంగాధర్, తునికి అంజన్న తదితరులు పాల్గొన్నారు.

కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం



పుస్తకం ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: కమిషన్ కార్యాలయంలో వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పక న్యాయం జరుగుతుందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం సీనియర్ సిటిజెన్స్, ప్రజాబాంధవి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల పిలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. వినియోగదారులు మోసాలకు గురైతే ఎలాంటి భయం లేకుండా కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాబాంధవి వినియోగదారుల సంఘం కార్యదర్శి దిండిగాల విఠల్, సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు పీసీ హన్మంతరెడ్డి, కోశాధికారి వెల్ముల ప్రకాష్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసల అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సారంగాపూర్: అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని వంచిత్ బహుజన్ అగాడి (వీబీఏ) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, నేతకాని మహర్ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. శనివారం నాగునూర్‌లో అంబేడ్కర్ విగ్రహంను పరిశీలించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

జేఎన్‌టీయూలో 'యువ ఉత్సవ్'

జగిత్యాల: భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం భారతదేశం అని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. శనివారం నెహ్రు యువ కేంద్రం క్రీడల యోజన ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ కొండగట్టులో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ నిర్వహించారు.యువకులు మంచి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పీడీ సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకట రాంబాబు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

కథలాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్‌వీ నాయకులపై చర్యలు తీసుకోవాలని శనివారం పోలీస్‌స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌వీ నాయకుల తీరుపై మండిపడ్డారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఆకుల సంతోష్, దొమ్మాటి అర్జున్, రాధారపు సాయితేజ, నల్ల ప్రదీప్, శనిగారపు హేమంత్ పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. స్వాన్ బిజినెస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 17న సోమవారం ఉదయం 11 గంటలకు కళాశాలలో డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ప్లేస్‌మెంట్‌సెల్ కో–ఆర్డినేటర్ నీరజ 94907 61403 సంప్రదించాలని కోరారు.

30 లోగా ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాలలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)కింద దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 30లోగా డబ్బులు చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకోవాలని ఎంపీవో ఏపీ రామకృష్ణరాజు తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం , మండలంలోని గోధూర్ గ్రామాలలో ఎల్ఆర్ఎస్ స్కీం క్రింద దరఖాస్తులు చేసుకున్నవారి ఇంటింటికి వెళ్ళి డబ్బులు చెల్లించాలని లేఖలు అందచేశారు. మండలంలో 269 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకోగా ఇబ్రహీంపట్నంలో 110 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నీచ రాజకీయాలు చేస్తోంది

కోరుట్ల: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తోందని కోరుట్ల మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, చీటి వెంకట్రావు శనివారం మాట్లాడారు. శాసన సభలో తెలంగాణ ప్రజల గొంతు వినిపించే ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఆయన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వనగడుపుల అంజయ్య, దుంపాల రాజనర్సయ్య, సజ్జు,సత్యం, గోపాల్, నర్సయ్య, పలువురు మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నక్ష కోసం అధికారుల సర్వే

జగిత్యాల: జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం నక్ష ఏర్పాటు చేయడం కోసం ఇటీవల సర్వే చేపట్టారు. హెలిక్యాప్టర్‌లో జగిత్యాలలో భూముల నక్ష కోసం సర్వే చేపట్టారు. ఏరియా ఎంత ఉంది, జగిత్యాల మున్సిపాలిటీ ఎంత పరిధిలో వస్తుంది, అన్ని హెలిక్యాప్టర్ ద్వారా పరిశీలించారు. కాగా, శనివారం సర్వే ఆఫ్ ఇండియా బృందం వచ్చి జగిత్యాలలో హద్దులను పరిశీలించారు. హద్దులను నిర్ణయించి, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్‌ను గుర్తించి, అనంతరం పూర్తిగా సర్వే చేస్తామని సర్వే ఆఫ్ ఇండియా పీటీఆర్ పేర్కొన్నారు.

మీసేవలో ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

ఇబ్రహీంపట్నం: మీసేవా కేంద్రాలల్లో దరఖాస్తుదారుల నుంచి నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు.శనివారం మండలంలోని గోధూర్‌లో మీసేవ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీసేవా కేంద్రానికి దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన వారిని సర్టిఫికేట్ల కోసం ఎన్ని డబ్బులు తీసుకుంటున్నారని దరఖాస్తుదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, మీసేవా కేంద్ర యాజమాని పురుషోత్తం పాల్గొన్నారు.

బీసీ సాధికారిత సంఘం మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ

కథలాపూర్: బీసీ సాధికారిత సంఘం మండల అధ్యక్షుడిగా గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన కాల్వ సత్యనారాయణను నియమిస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పాలాస నరేందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల ప్రధానకార్యదర్శిగా తాండ్ర్యాల గ్రామానికి చెందిన వంగ మహేందర్ యాదవ్‌ను నియమించారు. మండలంలో గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి వరకు బీసీ సాధికారిత కమిటీలను ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని మండల బాధ్యులకు సూచించారు.

యంగిస్తాన్ యూత్ అధ్యక్షుడిగా ప్రశాంత్

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో యంగిస్తాన్ యూత్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దయ్య ప్రశాంత్, కోశాధికారిగా నర్సయ్యను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని వారం రోజుల్లో నియమిస్తామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. యూత్ సభ్యులు సామాజిక సేవల్లో పాలుపంచుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

చెరువులకు గండి కొట్టే వారిపై కఠిన చర్యలు

కోరుట్ల రూరల్: చెరువులు, కుంటలకు గండి కొట్టే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈఈ జయప్రకాష్ అన్నారు. 9వ తేదీన కిషన్‌రావు పల్లె ఖజానా కుంటకు గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టారని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.రైతులు పాల్గొన్నారు.



ధర్మపురికి పోటెత్తిన భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజు శనివారం ప్రధాన, అనుబంధ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర గోదావరినదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారలను దర్శించుకున్నారు. భక్తులకు ఆర్య వైశ్య సంఘం, రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

5వ రోజుకు చేరిన దీక్ష



దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే నియామకాలు చేపట్టాలని కోరుతూ జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ చేపట్టిన నిరసన దీక్ష శనివారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగారాం మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే ఉద్యోగ నియామకాలు చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో ఆలస్యం జరిగితే ఎమ్మార్పీఎస్ పోరాటాలకు దిగకతప్పదని హెచ్చరించారు. దీక్షలో నాయకులు నురుగు శ్రీనివాస్, బెజ్జంకి సతీశ్, బోనగిరి కిషన్, బొల్లె రాజన్న, నక్క గంగారాం, నక్క రమేశ్, సంకెపు ముత్తు, కొల్లూరు సురేందర్,సునీల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక మహిళలకు సన్మానం



మహిళను సన్మానిస్తున్న డీపీఎం, ఐకేపీ సిబ్బంది

పెగడపల్లి: వ్యాపారంలో రాణిస్తున్న స్వయం సహాయక మహిళలను శనివారం అధికారులు సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన గట్టు కొమురమ్మ, నామాపూర్ గ్రామానికి చెందిన చాడ ప్రభావతి అనే స్వయం సహాయక సభ్యులు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు పొందారు. కొమురమ్మ పేపర్ ప్లేట్ల తయారీ ఇండస్ట్రీ, ప్రభావతి పసుపు పాలీష్ యూనిట్ స్థాపించి వ్యాపారంలో రాణిస్తున్నారు. దీంతో వీరిని మండలంలోని సెల్ఫ్ హెల్ప్ సంఘాల నుంచి మహిళా దినోత్సవం పురస్కరించి అధికారులు ఉత్తమ మహిళా వ్యాపారస్తులుగా ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో శనివారం కొమురమ్మ, ప్రభావతిలను డీపీఎం మానిక్‌రెడ్డి సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ పూట రామన్నపేటలో విషాదం

మల్యాల: హోలీ సంబురాల్లో పాల్గొన్న వివాహిత గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మల్యాల మండలం రామన్నపేటలో చోటు చేసుకుంది. రామన్నపేట గ్రామానికి చెందిన సిరిమల్ల జ్యోతి(40) శుక్రవారం ఉదయం హోలీ సంబురాల్లో పాల్గొంది. స్థానికులతో కలిసి సంబురాల్లో పాల్గొని, ఇంటికి వెళ్లిన అనంతరం అర్ధరాత్రి గుండెనొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలుపగా, కుటుంబ సభ్యులు స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స చేయించి, జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. జ్యోతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శనివారం దహన సంస్కారాలు నిర్వహించారు.

సెర్ప్ ఉద్యోగికి నివాళి

జగిత్యాలరూరల్: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం సీసీ మేరు కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, శనివారం జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఉద్యోగులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, డీఎంజీ దాస్, సీసీలు రవీందర్, మరియ గంగారాం, విద్యాసాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన పస్తం విష్ణు 100 మీటర్ల పరుగుపందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మహేశ్ శనివారం తెలిపారు. ఈనెల 23న హైదరాబాద్‌లో జరిగే 100 మీటర్ల పరుగుపందెం పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణును ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ జయశ్రీ, డైరెక్టర్ నిఖిల్‌కుమార్ అభినందించారు.

మెట్‌పల్లిలో ఇఫ్తార్ విందు

మెట్‌పల్లి: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమొరెడ్డి కరం అన్నారు. పట్టణంలోని బిస్మిల్లా మసీదులో శనివారం మర్కజీ ఇంతేజామి కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గంగసాగర్, డాక్టర్ రమేష్‌రెడ్డి, కమిటీ అధ్యక్షులు అక్తర్ జానీ, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్స్ ప్రారంభం

మేడిపల్లి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి గుడి, మార్కండేయ స్వామి గుడి, మాల సంఘం భవనంలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో మంజూరైన హైమాస్ట్ లైట్లను శనివారం ప్రారంభించినట్లు మేడిపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి నీరజ తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, బొంగోని రాజగౌడ్, చేపూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: నిరుద్యోగ బీసీ యువతి, యువకులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ నుంచి ఉచిత డ్రైవింగ్ కోర్సుల్లో హెవీ మోటర్ వాహనం, లైట్ మోటార్ వాహన శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సునీత తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 15 నుంచి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉచిత శిక్షణకు..

జగిత్యాల: జిల్లాలోనివెనుకబడిన తరగతుల అభ్యర్థులకు స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 15 నుంచి ఏప్రిల్ 8 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 0878–2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.